క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

నర్సింహులపేట: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కౌసల్యదేవి పల్లి శివారు రూప్లాతండాలో జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ సురేశ్(27)కు మూడు సంవత్సరాల క్రితం నెల్లికుదురు మండలం బంజర తండాకు చెందిన విజయతో వివాహమైంది. ఈ దంపతులకు ఒక పాప ఉంది. కొంత కాలం నుంచి మనస్పర్థలు వచ్చి ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినా ఇద్దరికి సయోధ్య కుదరలేదు. ఈ క్రమంలో భార్య, కూతురు తన దగ్గరకు రావడం లేదనే మనస్తాపానికి గురైన సురేశ్.. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి భద్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

గార్ల: గార్లలోని పుట్టకోట, దంపకం బజారులో 3రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం పడరానిపాట్లు పడుతున్నామని సోమవారం ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం గార్ల పాకాల ఏటి సమీపంలో గల రక్షిత మంచినీటి పథకం మోటార్లు మరమ్మతులు చేయించి, మిషన్ భగీరథ నీళ్లు రానప్పుడు పాకాల ఏటి నీటిని ప్రజలకు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గార్లలో తాగునీటి ఎద్దడిని నివారించాలని గార్ల పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



మహబూబాబాద్ అర్బన్: కేసముద్రం అర్పణపల్లి నుంచి ఖమ్మం గ్రానైట్‌లోడ్‌తో వెళ్తున్న లారీ సోమవారం తెల్లవారు జామున జిల్లా కేంద్రంలో రామచంద్రపురం కాలనీ వద్ద అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే.. జిల్లా కేంద్రంలోని రామచంద్రపురం కాలనీ నాలుగు బాటల సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయిన గ్రానైట్ లారీ రోడ్డుపై దిగబడింది. ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగలేదు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మరిపెడ రూరల్: విద్యుదాఘాతంతో సూడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని గాలివారిగూడెం శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గాలివారిగూడెం గ్రామానికి చెందిన రైతు చలమల్ల నర్సింహారెడ్డి చెందిన గేదెలు గ్రామ శివారులోకి వెళ్లాయి. ఇటీవల ఈదురు గాలులకు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. అక్కడే గడ్డి మేస్తున్న సూడి గేదె విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

నెహ్రూ వర్ధంతి

మహబూబాబాద్ రూరల్: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచారని టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్ అన్నారు. సోమవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ పోతురాజు రాజు, ఎండి హరుణ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవికుమార్, అర్బన్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద గొడవ

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్యకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. కొంత మంది పోలీసులు బీఆర్ఎస్ నాయకులకు కోవర్టులు పని చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాగ్వివాదం చేశారు. వెంటనే సీఐ పెండ్యాల దేవేందర్ అక్కడికి చేరుకుని అంజయ్యకు నచ్చ జెప్పి శాంతింప చేశారు. దాంతో గొడవ సద్దుమణిగింది.

ఘన నివాళి

డోర్నకల్: స్థానిక రైల్వే హైస్కూల్ విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు విజయసేన్ మృతికి ఆయన శిష్యులు ఘనంగా నివాళులర్పించారు. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందిన విజయసేన్ సంతాప సభ సోమవారం రైల్వే సంఘ్ భవన్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో విత్తనాల సుధాకర్, గారె రమేష్, కనకరాజ్, వెంకట్, బాజి, షాహీద్, బషీర్ పాల్గొన్నారు.

ఓటెత్తిన పట్టభద్రులు

కురవిలో ఓటేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో క్యూలో ఓటర్లు..



పెద్దవంగరలో..



దంతాలపల్లి: బారులుదీరిన ఓటర్లు





బయ్యారంలో..



కురవి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



గార్ల: ఓటు వేసిన ఐదుగురు అక్కాచెల్లెళ్లు



నెల్లికుదురు: మొదటిసారిగా ఓటు వేసిన యువకులు



గూడూరు: బ్యాలెట్ బాక్స్‌లను జిల్లా కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు



గార్ల: ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు



మరిపెడ: ఓటు వేసిన ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



చిన్నగూడూరు: ఓటేసిన మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



కేసముద్రం: అంధుడైన భర్తతో కలిసి ఓటు వేసిన భార్య



డోర్నకల్: చంటిపాపతో వచ్చి ఓటు వేసిన మహిళ



డోర్నకల్: ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు



మానుకోటలో ఓటు వేసిన అక్కాచెల్లెళ్లు

మహబూబాబాద్: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా జరిగాయి. ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రులు ఓటు వేసేందుకు భారీగా తరలివచ్చారు.

చిన్నగూడూరులో 70శాతం పోలింగ్..

చిన్నగూడూరు: మండలంలో 541మంది పట్టభద్రులు ఉండగా 376 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 70శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఓటు వేశారు.

గార్లలో 69.21శాతం..

గార్ల: గార్ల మండలంలో జరిగిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో 69.21శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల సెక్టోరియల్ అధికారి బాలరాజు సోమవారం వెల్లడించారు. మండలంలో 1,946 ఓట్లకు గాను 1,347 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ తెలిపారు. ఉదయం మందకోడిగా సాగిన ఎన్నికలు మధ్యాహ్నం నుంచి ఊపందుకున్నాయి.

నర్సింహులపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాల్లో 1,177 ఓట్లకు గానూ 870 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల పోలింగ్ 74.42 శాతం పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. తహసీల్దార్ నాగరాజు పర్యవేక్షణ చేశారు. ఎస్సై సతీష్ బందోబస్తు చేశారు.

మరిపెడ: మరిపెడలో పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలోని సీతారాంపురం పాఠశాలలో నిర్వహించిన ఎన్నికలను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పరిశీలించారు. ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 2014 ఓట్లు ఉండగా 1448 ఓట్లు పోలయ్యాయి. 71.89 శాతం నమోదైనట్లు సెక్టోరియల్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు.

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లోని ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 183వ బూత్ 1058 మందికి 777 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 184వ బూత్‌లో 969 మందికి 732 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పోలింగ్ కేంద్రం సమీపంలో బీఆర్ఎస్ కార్యకర్తలను కలిసి పోలింగ్ పరిస్థితిని సమీక్షించారు.

బయ్యారం: బయ్యారంలో 70.4శాతం నమోదైంది. 1,725 ఓటర్లకు గాను 1,215 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొత్తగూడ: మండలంలో 1,061 ఓట్లకు గాను 795 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 76శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

గంగారం: మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో మొత్తం 430 ఓట్లకు గాను 330 ఓట్లు పోలుకాగా 80శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు.

కురవి: కురవి, సీరోలు మండల కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కురవి జెడ్పీ హైస్కూల్‌లో 185 పోలింగ్ కేంద్రంలో 936 ఓట్లకు గాను 710 ఓట్లు, 186 పోలింగ్ కేంద్రంలో 904 ఓట్లకుగాను 660 ఓట్లు పోలయ్యాయి. సీరోలు మండల కేంద్రంలోని 194 పోలింగ్ కేంద్రంలో 817 ఓట్లకుగాను 601 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సందర్శించి పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

దంతాలపల్లి: మండలంలో 1,352 ఓట్లు ఉండగా, 993 ఓట్లు పోలయ్యాయి. 73శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పెద్దవంగర: మండల పరిధిలో మొత్తం 1,348 మంది ఓటర్లకు గాను 662 మంది పురుషులు, 338 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 74.18శాతం పోలింగ్ నమోదు అయ్యిందని అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని సీఐ సంజీవ, ఎన్నికల సెక్టోరియల్ అధికారి మరియన్న సందర్శించారు.

కేసముద్రం: కేసముద్రం మండలంలో మొత్తం 2,354 ఓట్లకుగాను, 1,726 ఓట్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా 73 శాతం పోలింగ్ జరిగింది. ఇనుగుర్తి మండలంలో మొత్తం 680 ఓట్లు ఉండగా, 510 ఓట్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహదారు వేం నరేందర్‌రెడ్డి కుమారుడు కృష్ణభగవాన్ తన ఓటు హక్కును కేసముద్రంలో వినియోగించుకున్నాడు.

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 1,938 ఓట్లకు 1,397 ఓట్లు పోలయ్యాయి. 70 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. సీఐ బాబురావు, ఎస్సై నగేష్ పోలింగ్ కేంద్రాల వద్ద ర్పాట్లు చేశారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహా

నెహ్రూసెంటర్: ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహా అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాధం భవన్‌లో సంఘ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహా మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి గ్రామంలో జూన్ 5, 6, 7 తేదీలలో నిర్వహిస్తున్నామని, ఈ తరగతులకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఆటాపాట ద్వారా ప్రజలను చైతన్యం చేసేందుకు, ఉద్యమాలకు, పోరాటాలకు ఆటాపాట ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి నక్క సైదులు, నాయకులు అల్వా రామకృష్ణ, మన్యం మల్లేష్, మహంకాళి హరిత, శ్రీనివాస్, సయ్యద్ ఖాజాపాషా, నరేందర్, రామయ్య, ఉప్పలయ్య, వెంకన్న, అచ్చ నాగేష్ పాల్గొన్నారు.

'గ్యారంటీ'ల అమలుకు చర్య తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

నెహ్రూసెంటర్: ఆరు గ్యారంటీలను అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యారంటీ హామీల అమలుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేసి అధిక ఫీజుల వసూలు చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని కోరారు. అర్హులైన వారందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, కనీస వేతన జీఓను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సూర్యం, వెంకటేశ్వర్లు, రంగయ్య, పాటు వెంకటేశ్వర్లు, బాలు, మధు, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

బోరును మూసివేయాలని వినతి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో తాగునీటి బావి సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా బోరు వేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం ఆర్ఐకి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కొమ్మినేని శ్రీను తాగునీటి బావికి 10 మీటర్ల దూరంలో బోరు వేసి వ్యవసాయానికి నీటిని వాడుకుంటున్నాడని తెలిపారు. ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న తాగునీటి బావి 500 మందికి తాగునీరు అందిస్తుందన్నారు. బోరు పూడ్చి కాలనీకి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీ బాధితులు రాములు, ఉప్పలయ్య, కొమురమ్మ, అశోక్, ఎల్లమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

గార్ల: రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన నిరుపేద గిరిజన రైతు ఇస్లావత్ అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తొలుత వెంకటాపురం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లోకేశ్వరరావు, ఈశ్వర్ లింగం, శాంతికుమార్, మోహన్, నంద్యా, లాల్‌సింగ్, నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులు ఆందోళన చెందొద్దు

- పూర్తి బాధ్యత మాదే
- ఏడీజీఎం శ్రీనివాసరావు



ఖాతాదారులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మంగపేట: మండలంలోని రాజుపేట కెనరాబ్యాంక్‌లో అసలు బంగారం మాయమైన విషయంలో బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టిన ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందొద్దని కెనరా బ్యాంకు వరంగల్ రీజినల్ కార్యాలయ అడిషనల్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు బాధిత ఖాతాదారులకు అభయమిచ్చారు. బ్యాంకులో అప్రైజర్‌గా పనిచేస్తున్న సమ్మెట ప్రశాంత్ ఖాదారులు తాకట్టు పెట్టిన బంగారం స్థానంలో నకిలీ (గిల్ట్)నగలు పెట్టి అసలు బంగారం మాయం చేసిన విషయాన్ని 'ఘరానా మోసం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైంది. ఈ విషయంపై స్పందించిన ఏడీజీఎం, ఏజీఎం మాధవి సోమవారం బ్యాంకును సందర్శించారు. అప్పటికే బ్యాంకులో తాకట్టు పెట్టిన ఖాతాదారులు వందల సంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకున్నారు. దీంతో స్థానిక ఎస్సై రవికుమార్ అక్కడికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ఖాతాదారులకు ఎలాంటి నష్టం ఉండదని పూర్తి బాధ్యత బ్యాంకు భరిస్తుందని సర్ది చెప్పారు. అయినప్పటికీ ఖాతాదారులు అదే విషయాన్ని బ్యాంకు అధికారులు హామీ ఇవ్వాలని పట్టుబట్టడంతో శ్రీనివాసరావు, మాధవి వచ్చి బ్యాంకులో తనఖాపెట్టిన 3 వేల బంగారం ప్యాకెట్లు ఉండగా గోల్డ్ అప్రైజర్ 24 మంది ఖాతాదారులకు చెందిన 27 అసలు బంగారం ప్యాకెట్లు మాయం చేసి వాటి స్థానంలో రోల్డ్‌గోల్డ్ నగలు ఉంచి పరారైనట్లు గుర్తించామన్నారు. వాటి బరువు సుమారు రెండు కిలోలకు పైగా ఉంటుందని, వాటి విలువ రూ.కోటి 50 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసినట్లు వివరించారు. బాధిత ఖాతాదారులకు నేటి మార్కెట్‌లో ఉన్న విలువ ప్రకారంగా నగదు లేదా బంగారం ఇచ్చేందుకు బ్యాంకు పూర్తి బాధ్యత వహిస్తుందని హామీ ఇవ్వడంతో ఖాతాదారులు శాంతించారు.

కాజేసిన బంగారంతో వివిధ బ్యాంకుల్లో తనఖా

బ్యాంకులో అసలు బంగారం కాజేసిన గోల్డ్ అప్రైజర్ ఆ బంగారాన్ని తన అనుచరవర్గానికి చెందిన పలువురి పేరిట అదే బ్యాంకుతో పాటు మరికొన్ని బ్యాంకుల్లో తనఖా పెట్టి వచ్చిన డబ్బులను సొమ్ము చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా బంగారం వ్యాపారి అయిన ప్రశాంత్‌కు స్థానికులు బంగారం వస్తువుల తయారీకి అడ్వాన్సుగా లక్షల్లో ఇచ్చినట్లు పలువురు బాధితులు వాపోయారు. అత్యంత నమ్మకంగా వ్యవహరిస్తూ పలువురి నుంచి సుమారు 1.50 కోట్లు అప్పుగా తీసుకున్నట్లు బాధితుల ద్వారా తెలిసింది. ఈ విషయంపై బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘరానా మోసానికి పాల్పడిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

నత్తనడకన రైల్వే బ్రిడ్జి పనులు

- గంటల తరబడి వేచి ఉంటున్న వాహనదారులు



గేటు వద్ద వేచి ఉన్న వాహనదారులు

గార్ల: గార్ల నుంచి డోర్నకల్ మధ్య రైల్వేగేటు ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు రైల్వేగేటు వద్ద గంటల కొద్ది వేచి ఉంటూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ గేటు వద్ద 10 నిమిషాలకు ఒకసారి రైళ్లు వెళ్తుండడంతో రైల్వేగేటు వద్ద ఒక్కోసారి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సమయంలో రైళ్లు రాకున్నా గేట్‌మెన్‌లు గేటు తీయకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రైల్వేగేటు సక్రమంగా తెరవకపోవడంతో ఆర్టీసీ ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజల సౌకర్యార్థం గార్ల–డోర్నకల్ మధ్యలోని రైల్వే గేటు వద్ద రైల్వేశాఖ 3ఏళ్ల క్రితం ఫ్లైఓవర్ బ్రిడ్జిని మంజూరు చేసింది. రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు రెండేళ్ల నుంచి కాంట్రాక్టర్ నత్తనడకన కొనసాగిస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించి అసౌకర్యాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఓటు గల్లంతు



కేసముద్రం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓ వ్యక్తి ఓటు గల్లంతైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన మేడి రమేష్ అనే వ్యక్తి తన ఓటును వేసేందుకు కేసముద్రంస్టేషన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 177వ పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. ఈ క్రమంలో అప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకున్నట్లు చూపిస్తుందని పోలింగ్ అధికారులు చెప్పారు. దీంతో అవాక్కైన అతడు, తాను ప్రభుత్వ ఉద్యోగిని కాదని, అసలు ఓటు వేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. సూర్యాపేటలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకున్నట్లు చూపుతుందని అధికారులు తెలిపారు. దీంతో పోలింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు రమేష్ తెలిపాడు.